ఈనాడు భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ఆగస్టు 31, 2026 5

కబ్జా చేస్తూ.. అక్రమంగా విక్రయిస్తూ

ఇల్లెందు, ఇల్లెందు గ్రామీణం, టేకులపల్లి, న్యూస్‌టుడే

ఇల్లెందు నియోజకవర్గంలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో చెరువులు, కాలువలు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయి. జలాశయాల హద్దులు కనుమరుగయ్యేలా వందల ట్రక్కుల మట్టి వేసి చదును చేస్తున్నారు. అనంతరం తప్పుడు పత్రాలు సృష్టించి లక్షల రూపాయలకు విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బందిని ప్రలోభాలకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలోని ఇల్లెందు పట్టణం, మండలం, టేకులపల్లిలో కబ్జాలపై ప్రత్యేక కథనం..


ఇల్లెందులో బందిరమళ్ల కుంటను ఆక్రమించి చదును చేసిన భూమి

ఇల్లెందు పట్టణంలో..

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి సత్యనారాయణపురం వెళ్లే రహదారిలో కుడి చేతి వైపు ఉన్న బందిరమళ్ల కుంట తెలియని వారుండరు. ప్రస్తుతం ఆ కుంటను కొందరు కబ్జా చేసి దొంగ పత్రాలు సృష్టించారు. విలువైన స్థలాన్ని మింగేసి ఎకరం, అరెకరం ఇష్టారాజ్యంగా విక్రయిస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు. వీరి వెనుక కొంత మంది రాజకీయ నాయకులు, అధికారులు ఉండటంతో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్న ఆరోపణలున్నాయి.

మండలంలో..

మండలంలోని సీఎస్పీ పంచాయతీలో సర్వే నంబర్ 539 పరిధిలో వీరయ్య కుంట విస్తరించి ఉంది. ఈ కుంటను కొంత మంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమార్కులపై స్థానికులు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా నేటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

చెరువులు, కుంటలు కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు. ఆ గ్రామాలను సందర్శించి కబ్జా చేసిన వారికి నోటీసులు ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటాం.

- ఖాసీం, తహసీల్దారు

టేకులపల్లిలో..

మండలంలోని జీ.కొత్తతండా గ్రామ పరిధిలోని ముంటికుంట చెరువును బిల్లుడుతండాకు చెందిన ఓ రైతు ఆక్రమించాడు. నిబంధనలకు విరుద్ధంగా మరికొంత మంది చెరువులో గొట్టపు బావులు, బోర్లు ఏర్పాటుచేసి నీటిని తరలిస్తున్నారు. ఆక్రమణలకు గురి కావడంతో గతంలో 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు నేడు 20 ఎకరాలకు పరిమితమైంది. పలువురు రైతులు కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు.

కలెక్టరేట్‌తో పాటు ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ ప్రజావాణి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ కార్యాలయంతో పాటు భద్రాచలం సబ్ కలెక్టరేట్, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం, జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో (ఎంపీడీఓ) ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అంకిత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల పరిధిలోని ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన వినతులను ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ అందించ వచ్చన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆదేశించారు.

అనుమతులు లేకుండానే వడ్డీ వ్యాపారం నూటికి రూ.5 నుంచి రూ.10 అక్రమ వడ్డీ వసూళ్లు

అవసరమే ఇంధనం

1 'కొత్తగూడెంలోని ఓ దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్న యువకుడు ఓ వ్యక్తి వద్ద రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనుకున్న ప్రకారం రూ.18లక్షలు తిరిగి చెల్లించాడు. సదరు అప్పు ఇచ్చిన వ్యక్తి అది వడ్డీకి సరిపోయింది. అసలు రూ.20లక్షలు తిరిగి ఇవ్వాలంటూ అతనిపై జులుం చేశాడు. తరచూ ఇంటికి వచ్చి ఇబ్బందులు పెడుతుండటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.'

2 'టేకులపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి మహిళ వద్ద రూ.10,000లు అప్పుగా తీసుకున్నాడు. ప్రతిగా ఆమె వద్ద తన ద్విచక్రవాహనాన్ని తాకట్టు పెట్టాడు. అసలు తిరిగి ఇచ్చే క్రమంలో నూటికి రూ.5చొప్పున వడ్డీ ఇవ్వాలంటూ ఇబ్బందులకు గురి చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మనీ ల్యాండరింగ్ యాక్టు కింద పోలీసులు కేసు నమోదు చేశారు.'

3 'బూడిదగడ్డ ఏరియాకు చెందిన టీవీ మెకానిక్ అవసరానికి ఓ వ్యక్తి వద్ద రూ.30వేలు అప్పుగా తీసుకున్నాడు. నూటికి రూ.5 చొప్పున వడ్డీ కట్టలేక అనుకున్న సమయానికి తిరిగి డబ్బులు ఇవ్వలేకపోయాడు. దాంతో మెకానిక్ వద్ద ఉన్న స్కూటీని బలవంతంగా తీసుకెళ్లాడు. ఆ ద్విచక్రవాహనం తనది కాకపోవడంతో అసలు వాహన యజమాని వచ్చి బదులుగా మెకానిక్ ఇంట్లోని టీవీ, ఇతర విలువైన సామగ్రిని తీసుకెళ్లాడు. బాధితుడు కొన్ని రోజుల పాటు భార్యాపిల్లలతో రాణా చుట్టూ తిరిగాడు.'



కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

అవసరార్థుల పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు ఇష్టారాజ్యంగా వడ్డీ విధిస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మనీ ల్యాండరింగ్ దందా చెలాయిస్తున్నారు. మోయలేని వడ్డీ భారంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు తాకట్టు పెట్టుకుని వడ్డీలకు రూ.లక్షలను మార్కెట్‌లో తిప్పుతున్నారు. గిరిగిరి పేరుతో నూటికి రూ.పది వడ్డీ చొప్పున ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కార్యకలాపాల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేకుండా చక్రవడ్డీలు వసూలు చేస్తున్నారు. ఆటోలు నడిపేవారు గత్యంతరం లేని పరిస్థితుల్లో వాహనానికి సంబంధించిన పత్రాలను తాకట్టు పెడుతున్నారు.

◆ ఒకరోజు వడ్డీ చెల్లింపులు ఆలస్యమైనా రూ.500 అదనంగా వసూలు చేసి పెనాల్టీ ఛార్జీలంటూ బుకాయిస్తున్నారు. అనధికారిక వడ్డీ వ్యాపారాలపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.

◆ మార్కెట్‌లో వ్యాపారులుగా చెలామణి అవుతున్న వారి వివరాలు సేకరించి సోదాలు జరిపితే నకిలీ వ్యాపారులు బయటపడే అవకాశం ఉంది.



ప్రజల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. బాధితులను బెదిరించి ఇబ్బందులకు గురి చేసే చేస్తే కఠిన చర్యలు తప్పవు. అనుమతిలేకుండా వడ్డీ వ్యాపారం సాగిస్తున్న వారిపై దృష్టిసారిస్తాం. ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణాలు పొందే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- రోహిత్‌రాజు, ఎస్పీ

నిఘా

1381.8 మె.ట డీఏపీ రాక

చింతకాని: పందిళ్లపల్లి రైల్వే ర్యాక్‌పాయింట్‌కు 1381.8 మెట్రిక్ టన్నుల డీఏపీ కాకినాడ ప్లాంట్ నుంచి ఆదివారం వచ్చిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు.

రేపటి నుంచి లోక్ కల్యాణ్ మేళా

2471 మందికి క్రెడిట్ కార్డులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వీధి వ్యాపారులకు రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తోంది. వీధి వ్యాపారులుగా దరఖాస్తు చేసుకొని ఇప్పటివరకు మొదటి విడత రుణాలు కూడా తీసుకోని వారికి సెప్టెంబరులో రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా నెల రోజులపాటు 'లోక్‌కల్యాణ్ మేళా' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పురపాలికల్లో వేలాది మంది వీధి వ్యాపారులు నమోదు చేసుకున్నా ఆశించిన మేర రుణ లక్ష్యాలు సాధించలేకపోయారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న 'లోక్ కల్యాణ్ మేళా'లో ఉమ్మడి జిల్లాలోని 3,495 మందికి మొదటి విడత రుణం రూ.15వేలు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దేశిత తేదీల్లో బ్యాంకర్లు, దరఖాస్తుదారులతో సమావేశాలు నిర్వహించి వీటిని మంజూరు చేస్తారు. ఇదే సందర్భంలో మూడు విడతల రుణాలు తీసుకొని వాటిని సక్రమంగా చెల్లించిన 2471మందికి క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తారు. మెప్మా సిబ్బంది ద్వారా రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

మొదటి విడత లక్ష్యాలు ఇలా..

పుర, నగరపాలకం	రుణ లక్ష్యం	క్రెడిట్ కార్డులు
అశ్వారావుపేట	488	0
కొత్తగూడెం	628	500
మణుగూరు	100	129
ఇల్లెందు	100	148
ఏదులాపురం	348	0
ఖమ్మం	1380	1180
మధిర	115	128
సత్తుపల్లి	100	225
వైరా	100	161

◆ ఇదే సమయంలో ఇప్పటికే ఖమ్మం జిల్లాలో రుణాలు తీసుకున్న 3,222 మంది, భద్రాద్రి జిల్లాలోని 3008 మంది వీధి వ్యాపారుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని లక్ష్యాలు నిర్దేశించారు.

◆ భద్రాద్రి జిల్లాలో సెన్సెస్ (అర్బన్ ఛాయలున్న) గ్రామాలైన భద్రాచలం, సారపాక, చుంచుపల్లి, గరిమెళ్లపాడు, లక్ష్మీదేవిపల్లిలో ఒక్కో ప్రాంతంలో 150 మంది వీధివ్యాపారులను గుర్తించి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

దందాలో ముఠా ఉందా?

● ఎమ్మెల్యే పీఏ ఆగడాలపై పోలీసుల విచారణ

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం ఎమ్మెల్యే వద్ద పర్సనల్ అసిస్టెంట్‌గా పని చేసిన కల్యాణ్‌కుమార్ మహబూబాబాద్ జిల్లాలో రెవెన్యూ శాఖ ఉద్యోగి. గతంలో భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో సీసీగా చేశాడు. దాదాపు రెండేళ్ల నుంచి డిప్యూటేషన్‌పై ఎమ్మెల్యే పీఏగా విధులు నిర్వహిస్తూ తనదైన శైలిలో సమాంతర పాలన సాగించాడు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.కోట్లు కొల్లగొట్టిన వ్యవహారంలో, ఈ దందా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అడ్డాగానే సాగిందని ప్రతిపక్షం ఆరోపిస్తుంటే, దీంతో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని అధికార పార్టీ చెబుతోంది. పీఏపై శుక్రవారం కేసు నమోదైంది. శనివారం కొత్తగూడెం పోలీసుల అదుపులోకి వెళ్లాడు. పదుల సంఖ్యలో యువకుల్ని ఎలా మోసపుచ్చాడు? అమాయకుల నుంచి వసూలు చేసిన రూ.కోట్లు ఏమయ్యాయి? అన్నది తేలాలి. విచారణలో కల్యాణ్ నోరువిప్పి ఏం చెబుతాడన్నది ఉత్కంఠగా మారింది.

బాధితుల సంఖ్య ఎక్కువే

నిందితుడు మణుగూరు, బూర్గంపాడు, పాల్వంచ మండలాల్లోని ప్రముఖ సంస్థల పేరిట నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చాడు. వీటిని ఒక్కరే తయారు చేశాడా లేక ముఠాగా చేశారా అన్నది తేలాలి. పరిశ్రమ ఏర్పాటుకు భూమిని ఇచ్చిన కొంతమంది తమకు ఉద్యోగాలు కల్పించాలని ఓ కార్యాలయానికి దరఖాస్తులు అందించారు. ఇందులోని సమాచారం ఆధారంగా నిరుద్యోగులకు గాలం వేశాడా? అన్న కోణంలోనూ విచారిస్తున్నారు. తనతోపాటు తన కుటుంబానికి చెందిన వ్యక్తుల ఖాతాల్లో ఈ లావాదేవీలు సాగాయి. ఒక బ్యాంకులో ఒక్కరి పేరిట ఒక్కటే ఖాతా ఉండాలని గ్రహించి ముగ్గురి పేరిట వేర్వేరు బ్యాంకుల్లో ఖాతాలను తెరిచినట్లు సమాచారం. డబ్బులిచ్చిన వారు గొడవ చేస్తే వివాదం బయటకు రాకుండా తమ ఖాతాల నుంచి చెల్లించేవాడు.

◆ దాదాపు ఏడాది నుంచి ఈ ఉద్యోగి ఖాతాలో ఆదాయానికి మించి భారీగా లావాదేవీలు సాగుతున్నా ఆయా బ్యాంకర్లు దీన్ని గుర్తించలేదట. ఇంకోపక్క అప్పు రూపంలో తీసుకున్నవీ కొందరికి ఎగ్గొట్టినట్టు సమాచారు.

● నిరుద్యోగులకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.10-15 లక్షల వరకు 30 మంది వద్ద తీసుకున్నట్లు చెబుతున్నప్పటికీ బాధితుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంలో పాత్రధారులు, సూత్రధారులు ఎవరన్నది వెల్లడి కావాలి.

● ప్రముఖుల నుంచి రూ.లక్షల్లో చేబదులు తీసుకున్నాడు. ఓ నాయకుడి వద్ద రూ.లక్షకు ఒక రోజుకు రూ.వెయ్యి వడ్డీ చొప్పున రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడంటే అర్థం చేసుకోవచ్చు. ఎమ్మెల్యేకు రక్షణ ఉన్న వారు సైతం తమ బంధువుల ఉద్యోగాల కోసం డబ్బులిచ్చిన నేపథ్యంలో వారినీ విచారించాల్సి ఉంటుందని పలువురు అంటున్నారు.

● సాధారణంగా కొలువుల పేరిట ఒకరిద్దరి నుంచి డబ్బులు గుంజుకుని ఉడాయిస్తేనే ఆయా ప్రభుత్వ పరిశ్రమలు దళారీలను నమ్మొద్దని ప్రకటనలు జారీ చేస్తుంటాయి. ఇంత తంతు సాగుతున్నా, నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు వెలుగుచూసినా ఏ పరిశ్రమ ఉన్నతాధికారి పోలీసులకు ఫిర్యాదు చేయటం, ప్రకటన విడుదల చేయటం వంటివాటి జోలికే వెళ్లలేదు.

నిధులతో ప్రయోగం

పాల్వంచ, న్యూస్‌టుడే

ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతోపాటు మొదటి సంవత్సరం అభ్యసిస్తున్న వారికీ ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ప్రయోగశాలల్లో పూర్తి స్థాయి పరికరాలు, రసాయనాలు, ఇతర సామగ్రి లేకుండా ప్రాక్టికల్ తరగతుల బోధన ఎలా సాధ్యమన్న వాదనలున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన ప్రయోగాత్మక విద్య అందించాలని సంకల్పంతో ఇంటర్మీడియట్ బోర్డు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిర్వహణ గ్రాంట్లు విడుదల చేసింది.



రూ.15.95 లక్షలు మంజూరు

జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగాల నిర్వహణకు రూ.6.48 లక్షలు, స్వీపర్, వాచ్‌మెన్, తాగునీటి, పారిశుద్ధ్యం, విద్యుత్తు, చిన్నపాటి మరమ్మతులు, ఫర్నిచర్ వంటివాటికి మొత్తం రూ.9.47 లక్షలు మంజూరయ్యాయి. ఆయా నిధులు ఇప్పటికే ప్రిన్సిపల్స్ ఖాతాల్లో మొత్తం రూ.15.95 లక్షలు జమ చేశారు. నిధుల కేటాయింపుతో ప్రయోగాలతో పాటు నిర్వహణపరంగా అధ్యాపకులకు ఇబ్బందులు తొలిగాయి. నిధులు సకాలంలో సద్వినియోగం చేసుకోని పక్షంలో వెనక్కి తీసుకుంటామన్న హెచ్చరికనూ బోర్డు చేసింది.

'ప్రభుత్వం విడుదల చేసిన నిధులు పారదర్శకంగా ఖర్చుచేసి, ప్రయోగశాలలు, మౌలిక వసతులు మెరుగుపరుచుకోవాలి. విద్యా ప్రమాణాలు మరింతగా బలోపేతం చేసుకోవాలి. నిధులతో నిర్వహణ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి.'

– వెంకటేశ్వరరావు, డీఐఈఓ

3 విడతల్లో పుష్కర ఘాట్లు!

గోదావరి పుష్కరాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఘాట్‌లను అభివృద్ధి చేసేందుకు రూ.వెయ్యి కోట్లతో ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రతువులో నీటిపారుదల శాఖ కీలక పాత్ర పోషిస్తోంది.

◆ 2027, జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటుసాగే గోదావరి పుష్కరాలకు భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు కోటి మంది భక్తులు తరలివస్తారని అంచనా.

భద్రాచలం, బూర్గంపాడు, న్యూస్‌టుడే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో మొత్తం అయిదు చోట్ల రూ.48.9 కోట్లతో స్నాన ఘాట్‌లను విస్తరించేందుకు చర్యలు మొదలయ్యాయి. రద్దీని అనుసరించి ఇంకా కొంత నిధితో తాత్కాలిక సదుపాయాలను కల్పిస్తారు. తొలి దశ పనులకు ఇప్పటికే శంకుస్థాపన పూర్తయింది. మిగతా పనులు త్వరలో ప్రారంభించి పుష్కరాలకు నెల ముందు అందుబాటులోకి తేనున్నట్లు ఈఈ జానీ తెలిపారు.

2015 పుష్కరాలతో పోల్చితే ప్రచార సమాచార వ్యవస్థ పెరిగింది. రవాణా మార్గాలు మెరుగయ్యాయి. కొవిడ్ ప్రభావంతో ఎక్కువమంది జీవన విధానంలో మార్పులు వచ్చాయి. పర్యాటకం, ఆధ్యాత్మిక సంచారానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో వచ్చే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పినపాక మండలం చింతలబయ్యారం, అశ్వాపురం మండలం చింతిర్యాల గ్రామాల్లో గోదావరి వద్ద రూ.2.25 కోట్ల చొప్పున రూ.4.5 కోట్లతో నూతనంగా ఘాట్‌లను నిర్మించాలని ప్రతిపాదించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ తీసుకుని వీటిని మంజూరు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరినట్లు తెలిసింది. చర్ల మండలంలోను ఒక ఘాట్ ఉంటే రద్దీ సమస్యను పరిష్కరించవచ్చని భావిస్తున్నారు.

పినపాక, అశ్వాపురం మండలాల్లో..

భద్రాచలం కీలకం

బాసర నుంచి భద్రాచలం వరకు ఘాట్‌ల విశిష్టతను పరిశీలిస్తే ఇందులో భద్రాచలం కీలకం. రాములవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పుష్కర స్నానం చేస్తారు. రోజుకి 4 లక్షల మంది భద్రాచలం ఘాట్‌కు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నా గడిచిన పుష్కరాల తరుణంలోనే రోజుకు నాలుగైదు లక్షల మంది వచ్చారు.

◆ ఈ క్రమంలో తొక్కిసలాటకు తావులేని విధంగా కరకట్ట కింది భాగంలో రూ.కోటితో పంచాయతీరాజ్ శాఖ సర్వీస్ రోడ్డును నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టింది. రూ.17.6 కోట్లతో జిల్లాలో పలుచోట్ల ర.భ శాఖ రోడ్లను నిర్మించేందుకు టెండర్‌లను ఖరారు చేసే పనిలో ఉన్నారు.


భద్రాచలం గోదావరి పుష్కర ఘాట్

ఘాట్ ప్రదేశం-విడత	నిధులు (రూ.కోట్లలో)
భద్రాచలం-1	46.65
దుమ్ముగూడెం పర్ణశాల-2	1.15
బూర్గంపాడు మోతె పట్టీనగర్-2	0.6
మణుగూరు చిన్నరావిగూడెం- 3	0.2
మణుగూరు రామానుజవరం-3	0.3

మండలాల్లోనూ ఏబీసీ కేంద్రాలు

● జిల్లా పంచాయతీ అధికారి అనూష

మండలానికో ఏబీసీ (యాంటీ బర్త్ కంట్రోల్) కేంద్రం ఏర్పాటు చేసి శునకాల నియంత్రణకు చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి అనూష పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్'లో వచ్చిన సమస్యలకు ఆమె పరిష్కారాలు చూపారు.

లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, న్యూస్‌టుడే



ఈనాడు ఫోన్ ఇన్

? గౌతంపూర్ పంచాయతీలో కోతులు, కుక్కల సమస్య అధికంగా ఉంది. 'భగీరథ' కోసం కాల్వలు తీసి వదిలేశారు. **- నవీన్, రాంసింగ్, వెంకటలక్ష్మి, శ్రీనివాస్, గౌతంపూర్ పంచాయతీ, (చుంచుపల్లి)**

డీపీవో: కోతులను పట్టించి దూరంగా వదిలేలా చర్యలు తీసుకొంటాను. ఏబీసీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.

? ఎస్ఆర్టీ ఖాళీ క్వార్టర్ల వద్ద పందుల సంచారం అధికమైంది. **- మునావార్, రుద్రంపూర్ (చుంచుపల్లి)**

● చర్యలు తీసుకుంటాం.

? నేను 2022-25 మేట్‌గా పని చేశాను. పంచాయతీ నుంచి రూ.57 వేలు రావాలి. **- రాకేశ్‌బాబు, పెనుబల్లి పంచాయతీ (చుంచుపల్లి)**

● అధికారులతో మాట్లాడి బకాయిలు చెల్లించేలా చర్యలు చేపడతా.

? చుంచుపల్లితండాలో కొన్నిచోట్ల వీధిదీపాలు సక్రమంగా లేవు. చుంచుపల్లి నుంచి విద్యానగర్ వెళ్లే దారిలో పాములు సంచరిస్తున్నాయి. **- రమేశ్ నాయక్, మంగీలాల్ నాయక్, మాళోత్ శివ, దేవి, చుంచుపల్లితండా (చుంచుపల్లి)**

● పారిశుద్ధ్య చర్యలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాను.

? గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా లేదు. చెత్త ట్రాక్టర్లు రావడం లేదు. **- రమేశ్, బోడు, టేకులపల్లి, ప్రభాకర్ రాజు, అశోక్‌నగర్, (లక్ష్మీదేవిపల్లి), బాలు, హౌజింగ్‌బోర్డుకాలనీ, నందాతండా (చుంచుపల్లి)**

● పరిశీలించి చర్యలు తీసుకుంటా.

? 20 రోజుల నుంచి కొత్తగూడెం వెళ్లే తాగునీటి పైపులైన్లు లీకై మా గ్రామంలో రహదారులు బురదమయంగా మారుతున్నాయి. **- రూప్లా, రేగళ్లపెద్దతండా (లక్ష్మీదేవిపల్లి)**

● ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈతో మాట్లాడి లీకేజీ సరిచేయిస్తాం.

? శ్రీనగర్ ఎంపీపీఎస్ స్కూల్‌కు సీసీ రోడ్డు ఎత్తుగా వేశారు. డ్రైనేజీలు సరిగా శుభ్రం చేయడం లేదు. **- చంటి, ప్రగళ్లపల్లి (దుమ్ముగూడెం)**

● ఇంజినీరింగ్, పంచాయతీ అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తాం.

? రాంనగర్‌లో టీఎన్‌జీవోస్ భవన నిర్మాణానికి సెల్లార్ తీశారు. రెండేళ్లుగా పనులు నిలిచి అందులో చెత్త, మురుగు పేరుకపోయింది. **- బండి విజయభాస్కర్, విద్యానగర్ పంచాయతీ (చుంచుపల్లి)**

● పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాను.

? కేజీబీవీ హాస్టల్ అపరిశుభ్రంతోపాటు దుర్వాసన వస్తోంది. **- రాగూర్, అళ్లపల్లి**

● అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా.

వృద్ధులకు చేయూతనివ్వరా?

పాల్వంచ గ్రామీణం న్యూస్‌టుడే



కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల గడువు నేటితో ముగియనుంది. బీడీ కార్మికులు, వృద్ధుల పింఛన్ల దరఖాస్తులు మినహా మిగిలిన అన్ని దరఖాస్తులను అధికారులు స్వీకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. వృద్ధులు, బీడీ కార్మికుల పింఛన్లపై స్పష్టత లేకపోవడంతో ఆ దరఖాస్తులను అధికారులు స్వీకరించట్లేదు. భద్రాద్రి జిల్లాలో 1,09,360 మంది పింఛన్లు తీసుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెల రూ.23.55 కోట్లు చెల్లిస్తోంది.

వృద్ధులు, బీడీ కార్మికులకు..

కొత్త పింఛన్ల కోసం పల్లెలు, పట్టణ ప్రాంతాల నుంచి 12,843 మంది దరఖాస్తులు చేశారు. వీరిలో వితంతువులు 8,447 మంది దరఖాస్తు చేయగా, ఒంటరి మహిళలు 1,039 దివ్యాంగులు 3,317 కల్లుగీత కార్మికులు 40మంది ఉన్నారు. తలసీమియా, సికిల్‌సెల్, హీమోఫీలియా బాధితులకు పింఛన్లు మంజూరు చేయనున్నారు. సరైన పత్రాలతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు పంచాయతీ కార్యదర్శి ద్వారా ఎంపీడీవోకు, పట్టణ ప్రాంత ప్రజలు వార్డు అధికారుల ద్వారా కమిషనర్‌కు దరఖాస్తులు చేయాలి. వృద్ధులకు, బీడీ కార్మికులకు మొండిచేయి చూపెట్టడంతో ఆందోళన చెందుతున్నారు. వయసు రీత్యా సత్తువలేక వేరే వారిపై ఆధారపడుతున్న వృద్ధులకు ఆసరా ఉండాలని బాధితులు కోరుతున్నారు.

దరఖాస్తులపై విచారణ..

కొత్తగా పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తులపై గెజిటెడ్ అధికారుల ఆధ్వర్యంలో విచారణ జరగనున్నట్లు సమాచారం. ఇందిరమ్మ ఇళ్లకు ఏ తరహాలో విచారణ చేసి అర్హులను గుర్తిస్తున్నారో అదే తరహాలో పింఛన్ అర్హులను గుర్తించనున్నారు. భూములు, వాహనాలు, అర్హత, కుటుంబ ఆర్థిక పరిస్థితి తదితర అంశాల్ని పరిగణనలోకి తీసుకోనున్నారు.

పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధారాలతో ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాప్య, బీడీ కార్మికులకు పింఛన్ల మంజూరుకు ప్రభుత్వ మార్గదర్శకాలు జారీ చేస్తోంది. వైకల్యం నిర్ధారణకు ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహిస్తున్నాం.

- రాజారావు, ఎంపీడీవో, పాల్వంచ

మార్కెట్ల మనుగడతోనే.. మద్దతు ధర

ఖమ్మం వ్యవసాయం, ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

మార్కెటింగ్‌శాఖను పూర్తిస్థాయిలో పటిష్ఠపరచి రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అధికార, అనధికార వ్యాపారాలు చేస్తూ తప్పుడు లెక్కలు చూపిస్తున్న ఖరీదుదారులపై నిఘా ఏర్పాటు చేశారు. వ్యాపారాలు సరళీకృతం చేసే చర్యలు ప్రారంభించారు.



ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలు..

రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లు అయిన ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, జనగాం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఖరీదుదారుల కొనుగోళ్లు, రైతుల చెల్లింపులు తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ నివేదికలు తయారు చేసే పనిలో ఉన్నాయి.

క్రయ విక్రయాలకు అవకాశం

ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, మత్కేపల్లి మార్కెట్లు ఉన్నాయి. వీటిలో కేవలం ఖమ్మం, ఏన్కూరు మాత్రమే రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్లు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు, ఖమ్మం జిల్లాలోని కారేపల్లిలో కొత్తగా మార్కెట్లు ఏర్పాటు చేశారు. మధిర, వైరా, మద్దులపల్లిలో అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉన్నందున అక్కడ నిరంతరం క్రయవిక్రయాలకు అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, దమ్మపేట, అశ్వారావుపేట, చర్లలో వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు మార్కెట్లలో కొనుగోళ్లు చేపట్టే అవకాశం ఉంది.

దళారులతో నష్టపోతున్న అన్నదాతలు..

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర దక్కాలంటే వ్యవసాయ మార్కెట్లు మనుగడలోకి రావాల్సిన అవసరం ఉంది. రైతు ముసుగులో పంటలు అమ్ముకుంటూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న దళారుల నుంచి కాపాడాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్లపై ఉంది. కచ్చితమైన తూకం, ధర ఇప్పించేందుకు రైతులను ఆదుకునే వ్యవస్థ వ్యవసాయ మార్కెటింగ్‌శాఖది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలు పండక, ఒక వేళ పండినా సరైన ధర రాక రైతులు నష్టపోయే అవకాశం ఉంది.

బహిరంగ వేలంతో ప్రయోజనం..

స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు చేయటం వల్ల జిల్లా రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్లి అక్కడ తక్కువ ధరకు అమ్ముకుని దూరభారంతో నష్టపోవాల్సిన అవసరం ఉండదు. బహిరంగ వేలం ద్వారా ఒక్కోసారి మద్దతు ధరకు మించి కూడా ధర వచ్చే అవకాశం ఉంటుంది. 2021-22లో కొత్తగూడెం, 2024-25లో ఇల్లెందు మార్కెట్లతో పాటు టేకులపల్లి సబ్‌యార్డులో మిరప కొనుగోళ్లు చేపట్టారు.

క్రీడలను వ్యాయామంగా సాధన చేయండి



విజేతలతో ఐటీడీఏ పీవో రాహుల్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కిన్నెరసాని క్రీడా పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా ఐటీడీఏ ఉద్యోగుల క్రీడలు ఆదివారం ముగిశాయి. వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్ తదితర క్రీడాంశాల్లో ఉద్యోగులు హోరాహోరీగా తలపడ్డారు. విజేత జట్లకు ఐటీడీఏ పీవో రాహుల్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఉద్యోగులు ఇలానే కలిసికట్టుగా క్రీడలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్రీడలప్పుడే కాకుండా ప్రతి రోజు వ్యాయామంగా ఏదో ఒక క్రీడను ఆడాలన్నారు.

విజేతలు వీరే..: మహిళల వాలీబాల్ పోటీలో భద్రాచలం డివిజన్ ప్రథమస్థానంలో నిలవగా ద్వితీయస్థానంలో దమ్మపేట నిలిచింది. పురుషుల్లో.. ఏకలవ్య గురుకుల ప్రథమ స్థానం సాధించగా భద్రాచలం జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది.

★ మహిళల టెన్నికాయిట్‌లో పార్వతి, పుష్పలత (దమ్మపేట-ఏ) జట్టు ప్రథమస్థానంలో నిలవగా అనూషభాయ్, కవిత (భద్రాచలం-బి) జట్టు ద్వితీయస్థానంలో నిలిచారు.

★ మహిళ చెస్‌లో లత(భద్రాచలం) ప్రథమస్థానం, భారతి(ఖమ్మం) రెండో స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో రాహుల్‌కుమార్, (ఈఎంఆర్ఎస్ దమ్మపేట) ప్రథమ, శ్రీనివాసరావు(భద్రాచలం) ద్వితీయస్థానాల్లో నిలిచారు.

★ మహిళ షటిల్ పోటీల్లో అనిత, అన్నపూర్ణ ఒకటోస్థానం సాధించగా, కృపావతి, పార్వతి రెండో స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో బలరాం, మోహన్ (దమ్మపేట), ఆంజనేయులు, లక్ష్మీనారాయణ (భద్రాచలం-ఏ) జట్టు ఒకటి, రెండు స్థానాల్లో నిలిచారు.

★ మహిళ క్యారమ్స్‌లో ప్రథమస్థానంలో విజయలక్ష్మి, పద్మావతి జట్టు నిలవగా, ద్వితీయస్థానంలో అనూషభాయ్, సరస్వతి జట్టు నిలిచింది. పురుషుల విభాగంలో ఎస్‌కే నజీర్, బన్సిలాల్ (దమ్మపేట) జట్టు ప్రథమస్థానంలో, అశోక్, రవి (టీడబ్ల్యూ గురుకులం) జట్టు ద్వితీయస్థానంలో నిలిచారు.

★ 60 మీటర్ల పరుగు పందెం మహిళా విభాగంలో కవిత (భద్రాచలం), నిర్మల తొలి రెండు స్థానాలు సాధించారు. పురుషుల్లో అనురాగ్, రాకేశ్ తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

★ షాట్‌పుట్‌లో కవిత, నీరజ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించగా, పురుషుల్లో సుధీర్‌కుమార్, జయప్రకాశ్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు.

నిబద్ధతతో 'కారుమంచి' సేవలు



కారుమంచిని సన్మానిస్తున్న కలెక్టర్ దివాకర, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాల్లో పనిచేసి కలెక్టరేట్ ఏఓగా ఉద్యోగ విరమణ పొందుతున్న కారుమంచి శ్రీనివాసరావు అందరివాడని, ఎంతో నిబద్ధతతో, సంయమనంతో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల నుంచి మెప్పు పొందారని కలెక్టర్ దివాకర, టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు సహా వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, పలు శాఖల అధికారులు కొనియాడారు. కారుమంచి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆదివారం వీడ్కోలు, సత్కార సభ నిర్వహించారు. తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగానూ ఆయన పనిచేస్తున్నారని, సమస్యల పరిష్కారంలోనూ కీలకపాత్ర వహించారని పేర్కొన్నారు. కారుమంచి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, టీజీఓ సంఘం ప్రతినిధులు మోదుగు వేలాద్రి, వెంకటేశ్వర్లు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, కస్తాల సత్యనారాయణ, శేషు ప్రసాద్, తహసీల్దార్లు సైదులు, కృష్ణప్రసాద్, పుల్లయ్య, రాంబాబు, టీఎన్జీఓ నాయకులు వల్లపు వెంకన్న పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి.. తోడల్లుళ్ల దుర్మరణం



నాగరాజు రమేష్

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: వివాహానికి హాజరై ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన దుర్ఘటన ఎర్రుపాలెం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెసరమల్లి నాగరాజు(32), ఏపీలోని గంపలగూడెం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొరకప్పుల రమేష్(45) ద్విచక్ర వాహనంపై బుచ్చిరెడ్డిపాలెంలో ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని తమ మామ ఇంటి నుంచి ప్రధాన రహదారిపైకి వస్తూ.. అదే సమయంలో మట్టి తరలిస్తున్న బనిగండ్లపాడుకు చెందిన ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ట్రాక్టర్ ఎదురుగా ఉన్న ప్రహరీని ఢీకొని ట్రక్కు వారిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మధిర గ్రామీణ సీఐ మధు, ఎస్సై రమేష్‌కుమార్ ప్రమాదస్థలాన్ని పరిశీలించి ట్రాక్టర్ ట్రక్కును తొలగించి మృతదేహాలను బయటకు తీశారు.

★ మృతి చెందిన నాగరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరూ ఇదే గ్రామానికి చెందిన ముల్లంగి లాజర్ కుటుంబంలో అల్లుళ్లు కావటంతో ఆయా కుటుంబాల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా ఘోర ప్రమాదం జరగటంతో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అశ్వాపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. మొండికుంట వద్ద మణుగూరు ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందగా మరొకరు చికిత్స పొందుతున్నారు. మృతుడిని మల్లెలమడుగుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి...

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఖమ్మం నగరం మూడోపట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు కథనం ప్రకారం.. స్థానిక బర్మాషెల్ రోడ్డులో సుమారు 60ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉండగా గుర్తించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో సర్వజనాసుపత్రి శవాగారానికి తరలించి భద్రపరిచారు. శవాన్ని గుర్తిస్తే తమ పోలీస్ స్టేషన్‌లో, 87126 59116, 87126 59115లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం-మల్లెమడుగు రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాస్ కథనం మేరకు.. నగరంలోని మామిళ్లగూడెం సమీపంలో శనివారం రాత్రి 10:00గంటల ప్రాంతంలో కాత్రా-తిరునల్వేల్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకోపైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనాస్థలానికి జీఆర్పీ పోలీసులు వెళ్లి వివరాలను సేకరించారు. మృతుడి వద్ద చరవాణి లభించినా, సిమ్ కార్డుతో పాటు చరవాణిలోని డేటా అంతా తొలగించబడి ఉందని తెలిపారు. మృతుడి వ్యక్తిగత వివరాలేమి తెలియరాలేదని, అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని పట్టాలపై నుంచి తొలగించి ఖమ్మం సర్వజనాసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి సమాచారం తెలిస్తే ఖమ్మం జీఆర్పీ స్టేషన్‌లో తెలియజేయాలని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

భార్య మందలించిందని భర్త బలవన్మరణం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం ఎందుకు తాగావని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం మందరికలపాడుకు చెందిన కుంజా నర్సింహారావు (49) కూలీ. కొద్ది రోజులుగా మద్యానికి బానిసై ఏ పని చేయట్లేదు. ఈనెల 29న మద్యం మత్తులో రోడ్డుపక్కన పడగా కుడి కనుబొమ్మ ప్రాంతంలో గాయమైంది. దీంతో భార్య జోగమ్మ మందలించింది. మనస్తాపానికి గురై ఇంట్లో చీరతో ఉరేసుకచున్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ డంపు స్వాధీనం



చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ మిషన్-2026 ముగిసినప్పటికీ అక్కడి అడవుల్లో భద్రతా బలగాలు ఏరియా డామినేషన్ ఆపరేషన్లను నిరంతరాయంగా కొనసాగిస్తున్నాయి. సుక్మా జిల్లాలోని కొంటా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్పోచ-గోంపడ్ రహదారి వెంబడి ఉన్న అడవిలో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్), బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో రెండు టిఫిన్ బాంబులు, భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరోపక్క నారాయణ్‌పూర్ జిల్లాలో స్థానిక పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు అదనార్ అడవుల్లో చేపట్టిన ఆపరేషన్‌లో పది రైఫిల్స్, బీజీఎల్ సెల్స్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి.

ఆర్చరీ క్రీడా పోటీలు

వైరా, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఆర్చరీ పోటీలు నిర్వహించారు. 65 మంది క్రీడాకారులు పాల్గొనగా రాష్ట్రస్థాయి పోటీలకు 24 మంది ఎంపికయ్యారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్చరీ క్రీడపై ఆసక్తి పెరుగుతున్నందున ప్రోత్సహించేందుకు క్రీడలను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు, వైరా ఏసీపీ సారంగపాణి, కార్యదర్శి పి.శంకరయ్య తెలిపారు. క్రీడా పోటీల్లో పుర వైస్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, ఎస్సై రామారావు, కాపా మురళీకృష్ణ పాల్గొన్నారు.



విజేతలతో ఏసీపీ సారంగపాణి

మాజీ ఎమ్మెల్యే విగ్రహావిష్కరణలో మంత్రి తుమ్మల

దమ్మపేట, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా దొమ్మేరులో మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు విగ్రహావిష్కరణలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆదివారం పాల్గొన్నారు. మంత్రికి స్థానిక తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు. తుమ్మల మాట్లాడుతూ.. స్వర్గీయ కృష్ణబాబుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మాటతీరు, మంచితనం, మోములో చిరునవ్వు తనకు ఎన్నటికి గుర్తుండిపోతాయన్నారు. అనంతరం కృష్ణబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



కృష్ణబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించాలి: పోటు

ఏదులాపురం, న్యూస్‌టుడే: పాలేరు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం గ్రామీణ మండలం ఎంవీపాలెంలో పార్టీ జిల్లా నాయకులు ఎస్.కె.లాల్‌మియా అధ్యక్షతన రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం-పని విధానం అనే అంశంపై హాజరై మాట్లాడారు. పాలేరు చెరువు కింద కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో 21వేల ఎకరాలకు సాగు, తాగు నీరు అందించాలన్నారు. కోట్లు కేటాయించి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నామని ప్రకటనలు చేస్తున్నా. జిల్లా రైతాంగానికి ఉపయోగపడే విధంగా ప్రాజెక్టులు డిజైన్ చేయడంలో జిల్లా మంత్రులు, అధికారులు విఫలమలవుతున్నారని ఆరోపించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న చెరువులను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కేంద్రం నిత్యావసరాలపై 50 శాతం ధరలను పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం మోపిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల స్ఫూర్తితో కమ్యూనిస్టు విప్లవకారులు పాలకవర్గ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గుర్రం అచ్చయ్య, శ్రీనివాసరావు, సి.వై.పులయ్య, జి.రామయ్య, కమ్మకోటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, శిరోమణి పాల్గొన్నారు.

రామయ్యకు ఘనంగా అభిషేకం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వారానికి ఒకసారి ఉండే అభిషేకం ఆనందం కలిగించింది. వచ్చే ఆదివారం నుంచి ఆంతరంగికంగా అభిషేకం ఉంటుంది. అందులో భక్తులకు ప్రవేశం ఉండదు. ఈ నేపథ్యంలో ఈ ఆదివారం విశేష సంఖ్యలో ధ్రువమూర్తుల అభిషేకం వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచనం చేశారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేన పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. నిత్య కల్యాణంలో భాగంగా మాంగళ్య ధారణ, జీలకర్ర బెల్లం, తలంబ్రాల వేడుక సంతోషాన్ని చాటింది.



గోదావరికి హారతి అందిస్తున్న పురోహితులు

గోదావరికి దివ్య హారతి: ప్రకృతిని, పవిత్ర నదులను పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పురోహిత సంఘం అధ్యక్షులు రామావరుల రవికుమార్ తెలిపారు. ప్రతి వారం తరహాలో ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరికి దివ్య హారతి అందించారు. హారతుల గొప్పదనాన్ని వివరించి విశ్వ శాంతి కోసం మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు చేశారు. నదీ ప్రవాహంలో పసుపు కుంకుమ సారె సమర్పించి జనులంతా సుఖశాంతులతో వర్ధిల్లేలా చూడాలని గోదావరికి మొక్కుకున్నారు. భక్తులకు దాతల సాయంతో తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనం పలికారు.

'వాచ్ బుక్ చేస్తే.. పేపర్లు వచ్చాయి'

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో తక్కువ ధరతో ఆకర్షణీయంగా కనిపించిన వాచీని కొనుగోలు చేద్దామని ఆశపడిన వ్యక్తి వచ్చిన పార్సిల్ విప్పి షాక్‌కు గురయ్యారు. ఖమ్మం నగరం 59వ డివిజన్ దానవాయిగూడేనికి చెందిన చెరుకుపల్లి ఉపేందర్‌ను సామాజిక మాధ్యమాల్లో రూ.వెయ్యికి వాచీ అంటూ కనిపించిన ప్రకటన ఆకర్షించింది. దాని ధర బహిరంగ మార్కెట్‌లో రూ.4వేలకు పైగా ఉంది. తక్కువ ధరకు వస్తోందని ఆర్డర్ పెట్టారు. ఆదివారం వచ్చిన ఏజెంట్‌కి రూ.వెయ్యి చెల్లించి పార్సిల్ తీసుకుని తెరిచారు. దానిలో రెండు టార్చ్ లైట్ల అట్టలు వాటిలో హిందీ న్యూస్ పేపర్ ఉండలుగా చుట్టి కుక్కి ఉన్నాయి. అవాక్కైన వారు సదరు ఏజెంట్‌కి తిరిగి ఫోన్ చేసి పిలిపించారు. వాగ్వాదం అనంతరం సదరు వ్యక్తి పార్సిల్ తీసుకుని వెళ్లారు. నగదు తిరిగి ఇమ్మంటే కంపెనీకి వెళ్లాయని చెప్పాడని, తిరిగి వస్తే ఇస్తానన్నాడని ఉపేందర్ తెలిపారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

టేకులపల్లి, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్రమంగా రవాణా అవుతున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యంను టేకులపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. టేకులపల్లి పోలీసులు ఆదివారం ఉదయం టేకులపల్లి పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా గొల్లప్రోడు గ్రామానికి చెందిన మోగిల్ల శివప్రసాద్ ట్రాలీ వాహనాన్ని రహదారి పక్కన అనుమానాస్పదంగా నిలిపి ఉంచడంతో పోలీసులు తనిఖీ చేశారు. అందులో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పాల్వంచకు చెందిన సంపత్ కుమార్, బోయిన నాగేంద్రబాబు, టేకులపల్లి మండలం కొప్పురాయికి చెందిన కల్యాణ్‌కుమార్ తక్కువ ధరకు ప్రజా పంపిణీ బియ్యం కొనుగోలు చేసి ట్రాలీ వాహనంలో కాకినాడ పంపిస్తున్నట్లుగా వెల్లడైంది. బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారమిచ్చామని ఎస్సై తెలిపారు.

10 మంది అధికారుల బదిలీ

కొత్తగూడెం సింగరేణి: సింగరేణి ఫైనాన్స్ విభాగానికి చెందిన పది మంది అధికారులను బదిలీ చేస్తూ జీఎం పర్సనల్ మురళీధర్ రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఒకరు జీఎం స్థాయి, ఐదుగురు ఏజీఎం స్థాయి, నలుగురు డీజీఎం స్థాయి అధికారులు ఉన్నారు. కొత్తగూడెం ఏరియా ఏజీఎం ఎరుకలి బీభత్స ఎస్టీపీపీ జీఎంగా, కొత్తగూడెం రీజియన్ డీజీఎం బి.సుధీర్ కొత్తగూడెం ఏరియా డీజీఎంగా బదిలీ అయ్యారు.

ఏమైపోయారో..!

★ బీడీసీఆర్ విశ్రాంత ఏఎస్ఎం కుటుంబంలో అనిశ్చితి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మేనేజర్‌గా పని చేసిన కనకస్వామి కుటుంబంలోనూ నేపాల్ విషాదం చోటుచేసుకుంది. అతను ఇక్కడ విధులు నిర్వర్తించినప్పుడు మేదరబస్తీలో ఉన్నా.. కొంతకాలంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు కుమారులను కోల్పోయిన అతనికి మిగిలింది కూతురు మాత్రమే. ఇటీవల నేపాల్‌లో సంభవించిన అనుకోని ఉపద్రవం ఆ కాస్త ఆసరాను తుడిచిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న నేపాల్ ఘటనలో కనకస్వామి కూతురు దీప్తి, అల్లుడు శ్రీధర్, మనువడు అభినవ్ ఆచూకీ తెలియడం లేదనే ప్రచారంపై స్పష్టత కొరవడింది. కొన్ని రోజులుగా వారి సెల్‌ఫోన్ల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు ఏమై పోయారో అనే ఆవేదన ఆ కుటుంబాన్ని విషాదంలో నింపింది. బీడీసీఆర్‌లో పని చేసిన నేపథ్యంలో ఆ వార్త దావానంలా వ్యాపించడంతో రైల్వే ఉద్యోగుల్లో సానుభూతి వ్యక్తం అవుతోంది. ముగ్గురు సంతానం కలిగిన కనకస్వామి ఇద్దరు వారసులను కోల్పోయి అల్లుడు శ్రీధర్‌ని కొడుకులా భావించి విశ్రాంత జీవితాన్ని హైదరాబాద్‌లో సాగిస్తున్న క్రమంలో మానస సరోవర్ యాత్రకు వెళ్లిన వారి ఆచూకీపై ఎలాంటి స్పష్టమైన సమాచారం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై బీడీసీఆర్ ఉద్యోగులు సైతం వారి ఆచూకీ లభించాలని ఆకాంక్షిస్తున్నారు.

మద్యం మత్తులో వైద్యులతో వాగ్వాదం

★ భయాందోళనకు గురైన సిబ్బంది, రోగులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి వచ్చి విధులు నిర్వహిస్తున్న మహిళా వైద్యులతో దురుసుగా ప్రవర్తించిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. 40 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి రాత్రి 9 గంటల సమయంలో ప్రభుత్వాసుపత్రికి వచ్చి అక్కడున్న మహిళా వైద్యులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. అమర్యాదగా మాట్లాడుతుండటంతో అక్కడున్న సిబ్బందితోపాటు, రోగులు కూడా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి సిబ్బంది అతన్ని అక్కడ నుంచి పంపించేయడంతో ఆ రహదారి గుండా వచ్చిపోయే వారిని అడ్డగిస్తూ వారితో కూడా ఇష్టారీతిలో ప్రవర్తించాడు. కొద్ది రోజుల నుంచి మద్యం మత్తులో కొందరు వివిధ కారణాలతో ఆసుపత్రికి వస్తూ విధుల్లో ఉన్న వైద్యులు, వైద్య సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం పరిపాటిగా మారిందని అక్కడి వైద్యులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. రాత్రి సమయంలో సెక్యూరిటీ సిబ్బంది ఒకరిద్దరు మాత్రమే ఉంటుండటంతో నియంత్రించలేకపోతున్నారని, పోలీసులు పెట్రోలింగ్ చేపట్టాలని, రాత్రి సమయంలో విధులకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

వీబీ జీరాంజీ ప్రణాళికల తయారీ

★ ప్రారంభమైన గ్రామసభలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రం రూపొందించిన వీబీ జీరాంజీ చట్టం-2025 అమలు దిశగా గ్రామీణాభివృద్ధి శాఖ అడుగులు వేస్తోంది. జులై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 125 రోజుల పనిదినాలు కల్పించేందుకు వికసిత్ పంచాయతీ ప్రణాళిక(వీజీపీపీ) పేరిట ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో అధికారులు ఆవైపుగా చర్యలు చేపట్టారు.

రెండు విడతల్లో ..

ప్రణాళికల తయారీకి రెండు విడతల్లో గ్రామసభలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు మొదటి విడత సభలు నిర్వహిస్తారు. వీటిలో వీబీ జీరాంజీ చట్టం ఉద్దేశాలు, అవగాహన, గ్రామానికి సంబంధించిన ప్రగతి నివేదిక, గత ఏడాది చేసిన పనులు, ఖర్చుల వివరాలు వంటి వాటిపై చర్చిస్తారు. 12 నుంచి 15 వరకు రెండో విడత సభలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలు, అంచనా వ్యయం వంటివి వివరిస్తారు. ఆమోదం అనంతరం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన మూడు బృందాల పరిశీలనకు పంపుతారు.

318 పనులకు అవకాశం

అన్ని జిల్లాలకు ఒకే విధంగా ప్రభుత్వం పనుల లక్ష్యాలను నిర్దేశించింది. ఖమ్మం జిల్లాకు కేటాయించిన 318 పనుల్లో నీటి భద్రత విభాగంలో 107, గ్రామీణ మౌలిక వసతులకు 90 పనులు, జీవనోపాధి వసతులకు 86, విపత్తుల నివారణకు 35 పనులు చేపట్టనున్నారు. ఈ బృందాలు గ్రామీణ స్థాయిలో క్షేత్ర పర్యటన చేసి, ప్రజలతో చర్చించి గ్రామ వనరుల ఆధారంగా వాటిని అంచనావేయాలి. జలసంరక్షణ పనులకు ప్రాధాన్యమిచ్చేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తల్లాడలో నిర్వహించిన గ్రామసభ

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

ప్రత్యేక చర్యలు చేపట్టాలి: డీఎస్పీ


డీఎస్పీకి స్వాగతం పలుకుతున్న సీఐ, ఎస్సైలు

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణతోపాటు నేరాల నియంత్రణ, నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇల్లెందు డీఎస్పీ యు.వెంకన్నబాబు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం ఆళ్లపల్లి పోలీసు ఠాణాను తనిఖీ చేశారు. ఠాణా నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, వివిధ రికార్డులు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. టేకులపల్లి సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై సోమేశ్వర్ పాల్గొన్నారు.

పూర్వీకుల ఆచారంగా పొట్టగండుగ - పచ్చ పండుగ

కరకగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రఘునాథపాలెంలో పూర్వకాలం నుంచి వస్తున్న పోలెబోయిన వంశం, పులి వంశస్థుల సంప్రదాయ ఆచారం పొట్టగండుగ - పచ్చ పండుగను ఆదివారం గ్రామస్థులు నిర్వహించారు. ఈ పండుగ జరపడం వలన కొత్త వరి, సామా, దుస్సొ కంకులు తదితర పంటలు పచ్చగా పొట్ట దశలో ఉన్న సమయంలో వాటిని ప్రకృతి, భూమి వేల్పుతో అనుసంధానం చేస్తూ ఈ ఆచారాన్ని నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయమని స్థానికులు తెలిపారు. గ్రామ పెద్దలు, పూజారులు, తలపతులు, వడ్డేలు తదితరులు పాల్గొన్నారు.


తమ కుల దేవతను పూజిస్తున్న గ్రామస్థులు

ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే పాయం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాన్ని ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్ర పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఎమ్మెల్యేను పార్టీ నాయకులు సత్కరించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరికృష్ణ, అబ్బులు, బాలాజీ, శేఖర్, స్వామి, దేవా పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పాయంను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేడుకగా గణేశ్ ఉత్సవాల అంకురార్పణ

చర్ల, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 14న జరగనున్న వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని చర్లలోని గణేశ్‌నగర్‌లో ఆదివారం అంకురార్పణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పందిరి ముహూర్తపు వేడుకను విశేష పూజలతో నిర్వహించారు. గణనాథుడికి తొలి పూజలు చేసి ప్రసాద వితరణ చేశారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గెలల సేకరణ కేంద్రాలపై.. పటిష్ఠ నిఘా అవసరం!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

ఆయిల్‌పాం గెలల సేకరణ కేంద్రాలపై పటిష్ఠ నిఘా ఉండాలని రైతులు కోరుతున్నారు. గెలల సేకరణ కేంద్రాల ప్రముఖ గుత్తేదారు తొలగింపుతో పలువురు రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పేరు చెప్పేందుకు ఇష్టపడని దమ్మపేట - సత్తుపల్లి మండల శివారు ప్రాంతాల్లోని కొంత మంది రైతులు ఇది మంచి శుభపరిణామం అని వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో ఇదే గుత్తేదారు ప్రైవేటు పరిశ్రమలకు గెలలు ఇక్కడి నుంచి పంపేవారని, తమ ఎఫ్‌కోడ్‌పై ఎందుకు నమోదు చేయలేదని అడిగితే కంప్యూటర్ పనిచేయడం లేదు, నెట్‌వర్క్ రావడం లేదని సదరు గుత్తేదారు సిబ్బంది చెప్పేవారని ఆరోపించారు. 'మీకు డబ్బులు వస్తున్నాయిగా, మీకేంటి ఇబ్బంది' అంటూ పంపించేవారని చెబుతున్నారు. గుత్తేదారు మహబూబాబాద్ జిల్లా నుంచి కూడా గెలల సేకరణలో అక్రమాలకు పాల్పడ్డట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఈ గుత్తేదారు వాహనాలు పరిశ్రమలకు వస్తే ఆలస్యం చేయకుండా వెంట వెంటనే దిగుమతి అవుతుంటే అనేక సార్లు రైతులు పరిశ్రమ వర్గాల వారితో ఘర్షణ పడిన సందర్భాలున్నాయి.


సేకరించిన ఆయిల్‌పాం గెలలు

నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలి

గెలల సేకరణ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. పట్టా పుస్తకాలున్నా, లేకపోయినా ఆయిల్‌పాం సాగు చేస్తున్న ప్రతి రైతుకూ ఎఫ్‌కోడ్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ములకలపల్లి, దమ్మపేట, సత్తుపల్లి, పాల్వంచ మండలాల్లో నెలకొన్న ఇలాంటి పరిస్థితిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ఎఫ్ కోడ్ ఇస్తాం: శంకర్, టీజీ ఆయిల్‌ఫెడ్ డీఓ

రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగు చేస్తున్న ప్రతి రైతుకూ ఎఫ్‌కోడ్ కేటాయిస్తామని టీజీ ఆయిల్‌ఫెడ్ డీఓ శంకర్ తెలిపారు. పాసుపుస్తకాలు లేనివారు నేరుగా ఆయిల్‌ఫెడ్ డీఓ కార్యాలయంలో సంప్రదిస్తే విచారణ జరిపి సత్వరమే ఎఫ్‌కోడ్ కేటాయిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: అంబేడ్కర్ సెంటర్‌లో చర్ల రోడ్డు వైపు పెట్రోల్ బంకు పక్కన, వెంకటేశ్వర కాలనీకి వెళ్లే వైపు రెండు చోట్ల రోడ్డు దెబ్బతిని, గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటోంది. **- రవి, స్థానికుడు**

సమాధానం: గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. **- రాజేశ్, జాతీయ రహదారుల డీఈ, కొత్తగూడెం**

– భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

కోయగూడెం పంచాయతీ శివారులో రోడ్డు పక్కన కొందరు ఇష్టానుసారం చెత్తను పడేస్తున్నారు. **సురేశ్, కోయగూడెం**

✔ సిబ్బందిని పంపి చెత్తను తొలగిస్తాం. **శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి**

– బూర్గంపాడు, న్యూస్‌టుడే

రామానుజవరంలోని పలు వీధుల్లో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. **- శ్రీను, స్థానికుడు** ✔ ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసి పగలు వెలగకుండా చేస్తాం. **వెంకటేశ్వర్లు, ఎంపీఓ**

వివేకానంద నగర్‌లో సీసీరోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. **- రవి, స్థానికుడు** ✔ సిబ్బందిని పంపించి రెండు రోజుల్లో తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు ఎంపీఓ**

–మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

గుర్రాలచెరువులో పాఠశాలకు సమీపంలో ర.భ రహదారి పక్కనే గొయ్యి మాదిరి తయారైంది. రాత్రిళ్లు ఎదురెదురుగా వాహనాలు వస్తే గోతుల్లో పడి ఇబ్బంది పడుతున్నారు. **- టి.సత్యనారాయణ, గుర్రాలచెరువు**

✔ ఒకటి రెండు రోజుల్లో గోతులు పూడ్చిస్తాం. **- జూపల్లి రమేశ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ – అశ్వారావుపేట, న్యూస్‌టుడే**

అశ్వాపురంలో జగదాంబ ప్రధాన కేంద్రం నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల వరకు రహదారి అధ్వానంగా ఉంది. డ్రైనేజీ సౌకర్యం సక్రమంగా లేక మురుగు నీరంతా రహదారిపై నుంచి ప్రవహిస్తోంది. **- వెంకటేశ్వర్లు, అశ్వాపురం**

✔ చర్యలు తీసుకుంటాం. **- సదర్‌లాల్, సర్పంచి**

మొండికుంట ప్రధాన కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలి. **- శ్రీనివాసరెడ్డి, మొండికుంట**

✔ ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నాం. సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవించాం. **- మల్లి సంధ్య, సర్పంచి – అశ్వాపురం, న్యూస్‌టుడే**

ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలి: మాజీ ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

భద్రాచలం పట్టణం: అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలని ఆదివాసీ చట్టాల పరిరక్షణ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర అన్నారు. స్థానికంగా గిరిజన సంఘాల సభ్యులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఏజెన్సీ గిరిజన చట్టాలను నిర్వీర్యం చేయాలని కొందరు కుట్ర చేస్తున్నారని దీన్ని సహించేది లేదన్నారు. పూనెం వీరభద్రం, నర్సింహారావు, రామకృష్ణ, చినబాబు దొర పాల్గొన్నారు.

మాలమహానాడు యువజన సంఘం ఎన్నిక

ములకలపల్లి, న్యూస్‌టుడే: మాలమహానాడు యువజన సంఘం ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ములకలపల్లి మండలం భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం గ్రామ కమిటీ అధ్యక్షునిగా సతీశ్, ఉపాధ్యక్షునిగా రణదేవ్, కార్యదర్శిగా ప్రభాకర్, అదనపు కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారులుగా పవన్, ప్రవీణ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడు రవి, సురేశ్ పాల్గొన్నారు.

48 గంటల దీక్షను జయప్రదం చేయాలి

చర్ల, న్యూస్‌టుడే: జీఓ నంబరు 3 స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త జీఓను తీసుకురావాలని, షెడ్యూల్ చట్టాలను పరిరక్షించాలని కోరుతూ వచ్చే నెల 1,2 తేదీల్లో చర్లలో జరిగే 48 గంటల దీక్షను గిరిజనులు జయప్రదం చేయాలని జీఎస్పీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గొంది లీలాప్రసాద్ పిలుపునిచ్చారు. పెదమిడిసిలేరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల హక్కులను అధికారులు కాలరాస్తున్నారని ఆక్షేపించారు. సీతమ్మసాగర్ కరకట్ట భూసేకరణలో ప్రభుత్వ భూములను ధారాదత్తం చేసిన అధికారులను సస్పెండ్ చేసి, దర్యాప్తు జరిపించాలన్నారు. కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, అంజిబాబు పాల్గొన్నారు.

కవి శ్రీనివాసరాజుకు సన్మానం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, కవి, రచయిత డా.అమ్మిన శ్రీనివాసరాజును ఆ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ తిప్పన సిద్ధులు ఆదివారం సన్మానించారు. మర్యాదపూర్వకంగా సిద్ధులును కలిసిన ఆయనకు శాలువా కప్పి పుస్తకాన్ని బహూకరించారు. ప్రస్తుతం ములుగు జిల్లా వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఆయన పలు రచనలు చేశారు. వివిధ పత్రికల్లో వ్యాసాలు ప్రచురితం అయినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే జారె నివాళి

ములకలపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో హత్యాచారానికి గురైన జిల్లాకు చెందిన యువతి మృతదేహానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం నివాళి అర్పించారు. స్వగ్రామానికి చేరిన ఆమె మృతదేహాన్ని అంబులెన్స్‌లో నుంచి బయటకు మోశారు. దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

గుండాల, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో తలపెట్టనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చీమలగూడెంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమై గోడపత్రికలను ఆవిష్కరించారు. వివిధ సంస్థలు, కార్యాలయాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన హక్కులు, చట్టాలు సక్రమంగా అమలుకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. లాలయ్య, సీతారాములు, సత్యం పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అస్థికల నిమజ్జనం

భద్రాచలం, న్యూస్‌టుడే: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్థికలను ఆదివారం భద్రాచలం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. కుటుంబ సభ్యులతో పాటు ఆ నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి నదిలో కలిపారు. స్నానాల ఘాట్‌లో పురోహిత సంఘం అధ్యక్షుడు రామావరుల రవికుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా ఉన్న ఓ సత్రంలో సంతాప సభను నిర్వహించారు. సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి స్వప్న, కుమారుడు నిదర్శన్‌రెడ్డి, కుమార్తె ధర్మిష్టారెడ్డితో పాటు నాయకులు నివాళులు అర్పించారు. గత నెల 31న సుదర్శన్‌రెడ్డి మృతి చెందారని ఇది తీరని లోటని అన్నారు. భారాసలో కీలక నేతగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



సుదర్శన్‌రెడ్డి సంతాప సభలో పాల్గొన్న నాయకులు

రహదారి పక్కనే మాంసం వ్యర్థాలు

మున్సిపాలిటీ పరిధి భద్రాచలం మార్గంలో ఓ పెట్రోలు బంకు ఎదురుగా రహదారి వెంబడి మాంసం వ్యర్థాలు, హోటళ్లలో తినిపారేసిన విస్తర్లు, కుళ్లిన కూరగాయల మూటలను పడేస్తున్నారు. చెత్తాచెదారం, తాగిన కొబ్బరి బొండాలు అక్కడే వేస్తున్నారు. ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జూపల్లి శశికళను వివరణ కోరగా. . మాంసం దుకాణదారులను గతంలో హెచ్చరించామన్నారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించి, మరోసారి హెచ్చరిస్తామన్నారు. **– అశ్వారావుపేట, న్యూస్‌టుడే:**



వీధి కుక్కలతో అవస్థలు



తిరుమలకుంట ప్రజలు కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులు, వీధుల్లో ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. శునకాల గుంపులను చూసి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి కార్తిక్‌ను వివరణ కోరగా.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.
– అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రమాదం జరిగితేగానీ పట్టించుకోరా!

అశ్వారావుపేట మండలం రామన్నగూడెం - వాగొడ్డుగూడెం మధ్య రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. 3 చోట్ల మూలమలుపుల వద్ద అప్రోచ్‌కు పోసిన కంకర వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో వాహన చోదకులు దగ్గరకు వెళ్లే వరకు ఇవి కనిపించవు. ప్రమాదం బారిన పడే ఆస్కారం ఉంది. రాత్రి సమయంలో అయితే మరీ ప్రమాదం. తెలంగాణ- ఏపీలోని సరిహద్దు గ్రామాల ప్రజలు ఈ దారిలో రాకపోకలు సాగిస్తారు. మరమ్మతులు చేయించాలని గిరిజనులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈఈ అక్షిత తెలిపారు.
– అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే



మిలాద్ ఉన్ నబీ వేడుకలు

అశ్వాపురం: అశ్వాపురంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. జామా మసీద్, మిలాద్ ఉన్ నబీ కమిటీలు ఆధ్వర్యం వహించాయి. స్థానికంగా ప్రదర్శన నిర్వహించారు. మత గురువులు, ముస్లింలు పాల్గొన్నారు.

మాది మాటల ప్రభుత్వం కాదు: జారె

చంద్రుగొండ, న్యూస్‌టుడే: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, గ్రామాల్లోకి వెళ్లి జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. చంద్రుగొండలో విశ్రాంత ఉద్యోగుల భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారాస నాయకుల ఆరోపణలను ఖండించారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. భారాస హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. విశ్రాంత ఉద్యోగులు జాన్‌వెస్లీ, కాళ్లూరి సుధాకర్‌రావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

బీసీఆర్ ట్రస్టు సేవలు అభినందనీయం: తెల్లం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో బీసీఆర్ ట్రస్టు సేవలు అభినందనీయమని భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానికంగా బీసీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి నెల వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేస్తున్నారు. ఆదివారం శిబిరం ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. కొవిడ్ సమయంలో సైతం ట్రస్టు ఆధ్వర్యంలో 75 రోజుల పాటు ఐసోలేషన్ సేవలు అందించినట్లు కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, రవికుమార్, ట్రస్టు కన్వీనర్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

అశ్వాపురం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ఆదివాసీ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇసంపల్లి కృష్ణ పాల్గొన్నారు. అధ్యక్షుడిగా మిరియాల బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా నరేశ్, ప్రధాన కార్యదర్శిగా రవి, అధికార ప్రతినిధిగా శివాజీ, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

ఇసుక లారీ పట్టివేత

దమ్మపేట, న్యూస్‌టుడే: ఏపీ నుంచి అనుమతి లేకుండా మండలానికి ఇసుక లోడుతో వచ్చిన ఓ లారీని గణేశ్‌పాడు అడ్డరోడ్డు వద్ద ఆదివారం ఎస్సై రాజేశ్‌కుమార్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. గ్రామంలో నుంచి దిగుమతి చేసిన ఇసుకను సీజ్ చేశారు. పట్టుబడిన లారీని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం?

అశ్వాపురం: అశ్వాపురంలో పోలీసులు ఆదివారం సాయంత్రం గంజాయి పట్టుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై సీఐ ఎల్లయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిశీలన జరుగుతోందని, వివరాలు తరవాత వెల్లడించగలమని చెప్పారు.

తాగునీటి కోసం ధర్నా.. స్పందించిన ఎమ్మెల్యే

దమ్మపేట, న్యూస్‌టుడే: దాదాపు నెల రోజులుగా వేధిస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మొద్దులగూడెం ఎస్సీ కాలనీ మహిళలు గ్రామ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ఆదివారం ధర్నా చేశారు. సీపీఎం నాయకులు, గ్రామస్థులు మద్దతుగా నిలిచారు. కాలనీలోని 200 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. సమస్యను ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేందర్‌లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎస్సీ కాలనీలో బోరు వేయించారు. కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.


ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

భద్రాచలం మాఫియాకు అడ్డాగా మారింది: భారాస

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం మాఫియాకు అడ్డాగా మారిందని భారాస నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ స్థానికంగా ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నారు. ప్రభుత్వ హామీల విఫలంపై భారాస వారం రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాలు వివరించారు. వారు మాట్లాడుతూ.. నయీమ్ గ్యాంగ్‌ను తలపించేలా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండా జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పీఏ, మొదట ఓ అనుచరుడు, మరొక ఎమ్మెల్యే మనిషి ముగ్గురు కలిసి రూ.60, 70 కోట్లలో కొల్లగొట్టి ప్రజలకు అన్యాయం చేశారన్నారు. తాతారావు, పవన్‌కుమార్, జానీ పాష పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భారాస నాయకులు రాంప్రసాద్, రామకృష్ణ

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం: కాంగ్రెస్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని పట్టణ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్పంచి పూనెం కృష్ణ, రాష్ట్ర పెరిక సంఘం వైస్ ఛైర్మన్ బుడగం శ్రీనివాస్, రవికుమార్‌లు ఆదివారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస భద్రాచలంలో ఏమి చేసిందో చెప్పాలన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడొద్దన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 20 వార్డులకు ఒక్క వార్డు గెలిచిన మీరు ఎమ్మెల్యేపై ప్రజల్లో విశ్వాసం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు రమాకాంత్, కృష్ణమూర్తి, రాజీవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నేడు ఐటీడీఏ గిరిజన దర్బారు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గిరిజన దర్బారు ఉంటుందని పీఓ రాహుల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. మన్యంలోని గిరిజనులు తమ సమస్యలను నేరుగా దర్బారులో వివరించి దరఖాస్తులు అందించాలని చెప్పారు.

పోలీస్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, న్యూస్‌టుడే: ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సైలు విజయ్‌సింహారెడ్డి, శివరామకృష్ణ తెలిపారు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల పరిధిలోని అభ్యర్థులు సంబంధిత స్టేషన్లలో దరఖాస్తు ఫారాలు తీసుకొని, అర్హత పత్రాలను జతచేసి అందజేయాలన్నారు. సెప్టెంబరు 6న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 8712682045, 8712682043 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎండిన నారుమడులు.. బీళ్లుగా వ్యవసాయ క్షేత్రాలు!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక పలు ప్రాంతాల్లో నారుమడులు ముదిరి ఎండిపోయాయి. కొద్ది రోజులుగా పడుతున్న జల్లులకు అక్కడక్కడా పచ్చగా ఉన్నా నాట్లు వేసేందుకు పనికిరాకుండా తయారయ్యాయి. ప్రధాన చెరువుల కింద ఈ పరిస్థితి రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది. సహజంగా ఏటా పంటలతో కళకళలాడాల్సిన భూముల్లో 80శాతం కూడా నాట్లు పడకపోవడంతో బీడు భూములుగానే కనిపిస్తున్నాయి. సెప్టెంబరు ప్రారంభమయినా చినుకుజాడ లేదు. వర్షాకాలం ప్రారంభంలో వేసిన పత్తి చేలు చాలా వరకు ఎండిపోగా ఆలస్యంగా గింజలు పెట్టిన పత్తి చేలు అడపాదడపా పడుతున్న జల్లులతో ప్రస్తుతం బాగానే ఉన్నాయి. చాలా చోట్ల రైతులు పత్తి గింజలు కూడా పెట్టకుండా వదిలేశారు. అశ్వారావుపేట మండలంలో 5800 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉన్నా 1500 ఎకరాల్లో కూడా నాట్లు పడని పరిస్థితి. పోసిన నారుమడులు వేసేందుకు పనికి రాకపోవడంతో అనేక చోట్ల పశువులను మేపుతున్నారు. 1800 ఎకరాల్లో వరి సాగయ్యే అశ్వారావుపేట వెంకమ్మ చెరువు కింద ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో 300 ఎకరాలు కూడా నాట్లు పడని పరిస్థితి. ఇదే పరిస్థితి నియోజకవర్గం మొత్తం ఉంది. వ్యవసాయ అధికారులు మాత్రం వర్షాభావ పరిస్థితుల్లో మెట్ట పంటలు సాగు చేయడం మేలని సూచిస్తున్నారు.


ఎండిపోయిన అశ్వారావుపేట వెంకమ్మ చెరువు కింద పోసిన నారుమడులు

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

మాస్‌లైన్‌లో పలువురి చేరిక

ఇల్లెందు గ్రామీణం: బోయితండా గ్రామ పంచాయతీ తుంటబాలతండాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య సమక్షంలో ఆదివారం సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిని గుమ్మడితో పాటు పార్టీనాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య నినాదాలు

మార్పు కోసమే దిల్లీ పోరుయాత్ర

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: దేశంలో మార్పు కోసమే దిల్లీలో జరిగే పోరుయాత్రకు తరలుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా తెలిపారు. దిల్లీలో జరగనున్న పోరుయాత్ర బహిరంగ సభకు తరలుతున్న వారికి ఆదివారం రైల్వేస్టేషన్‌లో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేశ్, సీపీఐ నాయకులు పుల్లారెడ్డి, లక్ష్మీకుమారి, రాహుల్, జమలయ్య, వెంకటేశ్వరరావు, సుధాకర్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య : కోయగూడెం పంచాయతీలోని ఉప్పరిగూడెం ప్రధాన రహదారిలో పెంటకుప్ప, చెత్త వేస్తున్నారు. డంపింగ్, చెత్త సేకరణ వాహనం ఉన్న రోడ్ల వెంట చెత్త వేస్తున్నారు. **- స్థానికులు**

సమాధానం: రహదారుల వెంట వేసిన పెంటకుప్ప, చెత్తను తొలగించి సమస్యను పరిష్కరిస్తాము. పెంటకుప్ప వేసినవారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తాము. **- పంచాయతీ కార్యదర్శి రమేశ్** - సుజాతనగర్, న్యూస్‌టుడే

అమ్మవారికి బోనాలు..



సోములగూడెం ఎస్సీకాలనీలో వేడుక

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణం, వివిధ గ్రామాల్లో ముత్యాలమ్మతల్లికి శ్రావణ మాసం మూడో ఆదివారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటికో బోనంతో డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ పూజారులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. గాంధీనగర్, సోములగూడెం ఎస్సీ కాలనీ, హమాలీకాలనీ, నవభారత్ ఏరియా వాసులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇల్లెందు గ్రామీణం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం శ్రావణమాస బోనాల వేడుకల సందడిగా కొనసాగింది. కొమ్ముగూడెంలో జరిగిన వేడుకలో మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.



ఇల్లెందు గ్రామీణం: కొమ్ముగూడెంలో బోనాలతో మహిళలు

ఇల్లెందు, న్యూస్‌టుడే: పట్టణంలోని నంబర్ 2 బస్తీ, స్టేషనుబస్తీ, జేకే కాలనీ, కాకతీయనగర్, చెరువుకట్ట ఏరియాల్లో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే : దాసుతండా పంచాయతీ రేగులతండాలో ఆదివారం బంగారు మైసమ్మ బోనాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనం ఎత్తుకొని ముత్యాలమ్మ తల్లి, నాభిశిల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి బంగారు మైసమ్మ తల్లి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రేగులతండాలో నూతనంగా నిర్మించిన ఆలయ స్వాగత తోరణాన్ని గ్రామస్థులు ప్రారంభించారు.

జూలూరుపాడు, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం ముత్యాలమ్మ, కోట మైసమ్మతల్లి, పెద్దమ్మతల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు. వివిధ గ్రామాల్లో బోనాలతో ఊరేగింపులు, డప్పు వాయిద్యాలు, నృత్యాలతో పోతురాజుకు మొక్కులు, గ్రామదేవతల విగ్రహాలకు జలాభిషేకాలు నిర్వహించారు.

వన్‌వే తిప్పలు.. రాకపోకలకు తంటాలు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే



రామవరం గోధుమవాగు వంతెనపై వన్‌వే చేసి బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు

జాతీయ రహదారిలోని రామవరం గోధుమవాగు వంతెనపై వన్‌వేతో వాహనదారులు తంటాలు పడుతున్నారు. వంతెనపై గుంతల సమస్య నిత్యం వేధిస్తూనే ఉంది. గత నెలలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నగరపాలక, జాతీయ రహదారి అధికారులు కొత్తగూడెం నుంచి విజయవాడ వైపు వెళ్లే రహదారి తాత్కాలిక మరమ్మతు పనులను పరిశీలించారు. జాతీయ రహదారుల అధికారుల అలసత్వంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా మరమ్మతులు పునరావృతం అవుతూనే ఉన్నాయి. తాజాగా విజయవాడ నుంచి కొత్తగూడెం వైపు వచ్చే రహదారిలో వంతెనపై గుంత ఏర్పడింది. దాంతో ఆ దారికి ఇరువైపులు బారికేడ్లు ఏర్పాటు చేసి వన్‌వేగా మార్చారు. వచ్చీపోయే వాహనాలన్నీ ఒకే దిశలో (వన్‌వే) ప్రయాణాలు సాగించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వంతెనపై వీధి దీపాలు సైతం సరిగా లేకపోవడంతో ప్రమాదాల భయం ప్రయాణికులను వెంటాడుతోంది. వారం రోజులు గడిచిపోయినా ఇప్పటి వరకు మరమ్మతు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. వంతెన నిర్మాణం లోపభూయిష్టంగా జరగడంతోనే తరచూ గుంతల మయంగా మారుతుందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన పేరుతో ప్రచారాలు సాగించే అధికారులు రోడ్డే సమస్యగా మారితే పట్టించుకోవడం లేదంటూ నిట్టూర్చుతున్నారు. సత్వరంగా వంతెనపై మరమ్మతులు నిర్వహించి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

కోనేరు సేవలు చిరస్మరణీయం



లయన్స్ క్లబ్ సభ్యుడు మోరిశెట్టి మోహన్‌రావుకి కేక్ తినిపిస్తున్న కోనేరు సత్యనారాయణ

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు 90వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన కుమారులు, కోనేరు పూర్ణచందర్‌రావు, సత్యనారాయణ (చిన్ని), అభిమానులు, లయన్స్ క్లబ్ సభ్యులు భజనమందిర్ రోడ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో శ్రీనగర్ ఫస్ట్ లైన్‌లో కేక్ కట్‌చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మోరిశెట్టి మోహన్‌రావు, పాండురంగారావు, బిర్రు నర్సింహారావు, పల్లపోతు శ్రీనివాస్, చంద్ర మధు, ఎం.వి.చౌదరి, మైనేని మోహన్, చెరుకు శ్రీనివాస్, శ్రీశైలం జయకుమార్, శ్రీనగర్ మాజీ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్, జె.పి.సైమన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెం పట్టణంలోని నార్త్ సెక్షన్ పరిధిలోని వినాయక విగ్రహాల తరలింపు సమయంలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు విద్యుత్తు లైన్లు ఎత్తు పెంచేందుకు అవసరమైన మరమ్మతులు చేపడుతున్నందున గాజులరాజం బస్తీ, బూడిదగడ్డ బస్తీ, మెయిన్ ఆసుపత్రి ఏరియా, ప్రభుత్వాసుపత్రి ఏరియా, సెవెన్‌హిల్స్ ఏరియా తదితర ప్రాంతాల్లో సోమవారం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ పి.హేమచంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టరేట్ ధర్నా చౌక్ సిద్ధం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఈనాడు కథనానికి స్పందన



మొన్నటి వరకు పిచ్చి మొక్కలతో నిండిపోయిన కలెక్టరేట్ ధర్నా చౌక్ ఆవరణను శుభ్రం చేశారు. కలెక్టరేట్ ధర్నా చౌక్ దుస్థితిపై ఈనెల 17న 'నిరసనలకు నిర్లక్ష్యపు స్వాగతం' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. పిచ్చిమొక్కలు తొలగించి కంకర యాష్ పోసి చదును చేశారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ, కార్మిక, యువజన, విద్యార్థి సంఘాలు చేపట్టే నిరసన దీక్షలకు అనువుగా మారింది. కూర్చొని నిరసన దీక్షలు చేసుకునేందుకు వీలుగా ఖమ్మంలో మాదిరిగా సిమెంట్ ఫ్లోరింగ్ చేసి, పర్మినెంట్ ఐరెన్ ఫెన్సింగ్ నిర్మించి ఓ గేటు ఏర్పాటు చేస్తే బాగుంటుందని, పశువులు వచ్చి పాడు చేయకుండా ఉంటాయని రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు కోరుతున్నారు.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలి

కామేపల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత భూముల మార్కెట్ ధర ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు కాలువ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు కామేపల్లిలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడారు. భూముల సేకరణకు సంబంధించి 2017లో నోటిఫికేషన్ జారీ చేసి, 2020లో ప్రభుత్వం అప్పటి మార్కెట్ ధర ప్రకారం రూ. పది లక్షల యాభై వేలు అవార్డు ప్రకటించిందన్నారు. అప్పటి మార్కెట్ ధర ప్రకారం 2026 సంవత్సరంలో నగదు జమ చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఎకరానికి రూ. 25 లక్షల పరిహారం అందించాలన్నారు. నాయకులు కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న, రమేశ్, రెడ్డి పాల్గొన్నారు.

కవి శ్రీనివాసరాజుకు సన్మానం

భద్రాచలం పట్టణం: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, కవి, రచయిత డా. అమ్మిన శ్రీనివాసరాజును ఆ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ తిప్పన సిద్దులు ఆదివారం సన్మానించారు. మర్యాదపూర్వకంగా సిద్దులును కలిసిన ఆయనకు శాలువా కప్పి పుస్తకాన్ని బహూకరించారు. ప్రస్తుతం ములుగు జిల్లా వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఆయన పలు రచనలు చేశారు. వివిధ పత్రికల్లో వ్యాసాలు ప్రచురితం అయినట్లు తెలిపారు.

రహదారికి మరమ్మతు చేయాలి

కామేపల్లి, న్యూస్‌టుడే: భాసిత్‌నగర్ గ్రామ ప్రధాన కూడలి సమీపంలో రహదారి బురదమయంగా మారి అధ్వానంగా ఉందని సీపీఎం మండల మాజీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

భాజపా కార్యాలయంలో 'మన్ కీ బాత్' ప్రత్యక్ష ప్రసారం



'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భాజపా నాయకులు, కార్యకర్తలు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఇక్కడి భాజపా కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ దేశంలో భాజపా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించడంతో, సామాన్య ప్రజలతో స్వయంగా మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకొని అందుకు అనుగుణంగా పాలన సాగించడం గమనార్హం అన్నారు. కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, నాయకులు బలగం శ్రీధర్, గుమలాపురం సత్యనారాయణ, సుర్వి రాజశేఖర్, నైనిక రుజువా, భాజపాలోని అన్ని విభాగాల బాధ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు

ఇల్లెందు, న్యూస్‌టుడే: వ్యక్తి ఆత్మహత్యపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొజ్జాయిగూడెం పంచాయతీకి చెందిన భూక్య బాలాజీ, వినోద దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి బాలాజీ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

క్రీడల నిర్వహణకు రూ.1.35 కోట్లు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: నూతన క్రీడా సంవత్సరానికి సింగరేణి యాజమాన్యం క్రీడాక్యాలెండర్‌ను విడుదల చేసింది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహించేందుకు రూ.1.35 కోట్ల నిధులు కేటాయించింది. సెప్టెంబరు నుంచి నవంబరు చివరి వారం వరకు 15 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలో వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని తెబొగకాసం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్ర కార్మిక శాఖ ఉప కమిషనర్‌కు లేఖ రాశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు 2023, డిసెంబరు 27న నిర్వహించారని, అదే రోజు ఫలితాలు ప్రకటించారన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు 2024, సెప్టెంబరు 9న అధికారిక పత్రాలు ఇచ్చారని వివరించారు. దీని ప్రకారం రెండేళ్ల కాలపరిమితి ముగియడానికి పది రోజులు మిగిలి ఉందన్నారు. పదవీ కాలం పూర్తి కాగానే ఎన్నికలు నిర్వహించాలని, అప్పటి వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని నాయకులు ఎం.రాజిరెడ్డి, టి.రాజారెడ్డి కోరారు.

ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలి: మాజీ ఎమ్మెల్యే

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా ఆదివాసీ చట్టాలను పరిరక్షించాలని ఆదివాసీ చట్టాల పరిరక్షణ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర అన్నారు. స్థానికంగా గిరిజన సంఘాల సభ్యులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఏజెన్సీ గిరిజన చట్టాలను నిర్వీర్యం చేయాలని కొందరు కుట్ర చేస్తున్నారని దీన్ని సహించేది లేదన్నారు. పూనెం వీరభద్రం, నర్సింహారావు, రామకృష్ణ, చినబాబు దొర తదితరులు పాల్గొన్నారు.

కొత్తగనులతోనే సింగరేణికి భవిత



సమావేశంలో మాట్లాడుతున్న రజాక్

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి భవిష్యత్తుకు కీలకమైన కొత్త గనులను సాధించేందుకు కృషిచేయాల్సిన అవసరం ఉందని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం బ్రాంచి ఉపాధ్యక్షుడు రజాక్ సూచించారు. ఐఎన్‌టీయూసీ సెంట్రల్ బ్రాంచి, పిట్ కార్యదర్శుల సమావేశం ఆదివారం రుద్రంపూర్‌లో ఏర్పాటైంది. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, మారుపేర్ల సమస్యకు పరిష్కారం, సొంతింటి కల పథకాన్ని అమలు చేసే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను ప్రకటించాలని కోరారు. సమావేశంలో బుటిక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, జిదుల రాజేశ్వరరావు, సమ్మయ్య, అశోక్, శ్రీనివాస్, రాజశేఖర్, చిలుక రాజయ్య, కుమారస్వామి, సత్తార్‌పాషా, మోహన్‌రెడ్డి, శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అలలపై తేలియాడారు.. సఫారీలో షికార్లు చేశారు

కిన్నెరసాని రిజర్వాయర్‌ను 607 మంది ఆదివారం సందర్శించారు. బోటులో అలలపై తేలియాడారు. సఫారీలో షికార్లు చేశారు. పిల్లలు దుప్పులపార్కు, బాతులకొలను వద్ద సందడి చేశారు. డీర్‌పార్కు రుసుం రూ.30,805 రాగా, సఫారీ ఆదాయం రూ.7వేలు వచ్చింది. సందర్శనకు వచ్చిన పర్యాటకుల్లో 260 మంది బోటులో రిజర్వాయర్లో తిరిగగా ఆదాయం రూ.16,610 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. - పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



బోటులో పర్యటిస్తున్న పర్యాటకులు

పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

టేకులపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో త్వరలో వెలువడనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగ యువత కోసం పోలీస్ శాఖ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బోడు ఎస్సై రాజమౌళి తెలిపారు. బోడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత శిక్షణ పట్ల ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి ఈనెల 31 సాయంత్రం ఐదు గంటల లోపు బోడు పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. శిక్షణ సమయంలో మధ్యాహ్నం ఉచిత భోజనం, స్టడీ మెటీరియల్స్, నోట్స్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

సీపీఎం నాయకుడి మృతికి సంతాపం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: మండలంలోని సూరారానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు సిద్దెబోయిన కృష్ణయ్య(67) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయంపై సీపీఎం నాయకులు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. భూక్యా వీరభద్రం, యాసా నరేశ్, ధర్మా, వీర్లరమేశ్, సంజీవరావు, రాములు, సుగుణ, వెంకటి తదితరులు నివాళులర్పించారు. ☆ భారాస వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు, మాజీ వైస్ ఎంపీపీ సీతాకుమారి, సీహెచ్ రామ్మూర్తి, మార్కాపురి నరసింహారావు తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మంచిర్యాల మహాసభను జయప్రదం చేయాలి



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సెప్టెంబర్ 8, 9న మంచిర్యాలలో జరగనున్న అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు తెలిపారు. సభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం కొమరారంలో గోడప్రతులను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి, రాష్ట్రకమిటీ సభ్యులు తుపాకుల నాగేశ్వరరావు, మాలు, రాజు, సంతు, శ్రీను, భాస్కర్, కోటన్న పాల్గొన్నారు.

చిత్తడితో ఇబ్బంది.. శాశ్వత రహదారులు నిర్మించండి

చుంచుపల్లి, న్యూస్‌టుడే



నందాతండా బంజారాహిల్స్ కాలనీ దారి దుస్థితి

చిన్నపాటి వర్షం పడినా నందాతండా పంచాయతీ బంజారాహిల్స్ కాలనీకి వెళ్లే దారి చిత్తడిగా మారుతోంది. కాలనీలో ఉద్యోగులు అధికంగా నివసిస్తున్నారు. శాశ్వత రహదారులు లేకపోవడంతో నిత్యం వారు రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది. వర్షం పడితే గుంతల్లో నీటినిల్వలు ఉండి బురదతో తీవ్ర అవస్థలు పడుతున్నామని, రహదారి నిర్మాణంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి మట్టి దారులను సీసీదారులుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: గిరిజన లంబాడీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీదేవిపల్లిలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేఏల్ఎస్ ఐకాస ఛైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సింగరేణి సంస్థలో 80 శాతం ఉద్యోగ అవకాశాలు గిరిజనులకే కల్పించాలని, గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కులు, ఉద్యోగ అవకాశాలు, సమస్యల పరిష్కారం కోసం అన్ని గిరిజన లంబాడీ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ నాయక్, భట్టు జుంకీలాల్, దుర్గా ప్రసాద్, ప్రేమ్‌చంద్ నాయక్, హతీరాం తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సంఘాల నాయకుల సంఘీభావం

సింగరేణి క్రీడా కో ఆర్డినేటర్‌గా కిశోర్ నియామకం



సమావేశంలో పాల్గొన్న సింగరేణి అధికారులు

ఇల్లెందు సింగరేణి, న్యూస్‌టుడే: ఇల్లెందు ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్‌గా అజ్మీరా కిశోర్, జనరల్ కెప్టెన్‌గా రాపూరి బాపురావును అధికారులు నియమించారు. స్థానిక జీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి ఎస్వోటూ జీఎం రామదాసు మాట్లాడుతూ.. సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు, కార్మికుల మానసిక ఉల్లాసానికి ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి కార్మికులు రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఏరియా బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, అధికారుల అజ్మీరా తుకారం, సుధాకర్, అశోక్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతికి కారకులను శిక్షించాలి

ఇల్లెందు, న్యూస్‌టుడే: భద్రాద్రి జిల్లాకు చెందిన నర్సును హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని టీపీజీఎస్ జిల్లా నాయకులు వజ్జా సురేశ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. గిరిజన యువతిని దారుణంగా హత్య చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు రాజశేఖర్, భవాని, మహేశ్వరి, రాములు, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

కామేపల్లి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో మృతి చెందిన జానీపాషా కుటుంబ సభ్యులకు తిరుమల స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు చల్లా తిరుమలరావు ముచ్చర్లలో 50 కిలోల బియ్యాన్ని ఆదివారం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, నర్సయ్య, రాము, షంషుద్దీన్ పాల్గొన్నారు.

ఇల్లెందు పురపాలికలో చెత్త చిచ్చు

ఇల్లెందు, న్యూస్‌టుడే



పురపాలిక కార్యాలయ ఆవరణలో తడి, పొడి చెత్త వాహనాలు

ఇల్లెందు పురపాలికలో ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ వ్యవహారం కౌన్సిలర్ల మధ్య విబేధాలతో పాటు పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. చెత్త సేకరణ బాధ్యతలను ఓ ప్రైవేటు ఏజెన్సీకి సంబంధించిన వ్యక్తికి ఇచ్చేందుకు పురపాలిక అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ ఏజెన్సీకి ఇస్తే ఒక్కో ఇంటికి ప్రతి నెల రూ.50, దుకాణానికి రూ.100, రూ.150 వసూలు చేయనున్నారు. ఏజెన్సీ బాధ్యులు వార్డుల్లోని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే తమకు చెడ్డ పేరు వస్తుందని కొందరు కౌన్సిలర్లు ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గంలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా ఏజెన్సీ విషయంలో కొంత మంది మాత్రమే అనుకూలంగా, మరికొందరు వ్యతిరేకంగా ఉన్నారు.

ఒక్కొక్కరికి రూ.10వేల ముడుపులు..

చెత్త సేకరణ ఏజెన్సీకి అప్పగించేందుకు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లకు రూ.10వేల చొప్పున ముట్టజెప్పేందుకు ఏజెన్సీ ప్రతినిధి ముందుకొచ్చారు. ఇప్పటికే కొంత మంది కౌన్సిలర్లకు రూ.10 వేలు ఇచ్చారు. కొంత మంది తీసుకోలేదు. వార్డులో చెడ్డపేరు తెచ్చుకోవద్దని తీసుకున్న వారిలో ఓ ముగ్గురు కౌన్సిలర్లు తిరిగి వెనక్కి ఇచ్చినట్లు సమాచారం.

ప్రజలపై భారం...

పురపాలికం చెత్త సేకరణ బాధ్యతను ప్రైవేటు ఏజేన్సీకి అప్పగిస్తే ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. పురపాలికం నిర్ణయించే రుసుము వసూలు చేస్తారా? ఎక్కువ వసూలు చేస్తారా? అనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి.

ఏజెన్సీకి అప్పగించలేదు..

వెంకటేశ్వర్లు, పురపాలిక శానిటరీ ఇన్‌స్పెక్టర్

తడి, పొడి చెత్త సేకరణ ఏజేన్సీకి అప్పగించలేదు. ఈ విషయమై చర్చలు జరుగుతున్నాయి. అధికారులు, పాలకవర్గం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మధుమేహ నిర్ధారణ పరీక్షలు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు రామవరంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ఉచితంగా ఆయా ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బాబురావు తెలిపారు. వెంకటపుల్లయ్య, నగేశ్, వెంకటేశ్వర్లు, రాజేశ్, నరసింహం తదితరులు పాల్గొన్నారు.